
# కుక్కతోక

రచన: వి. యస్. యన్. మూర్తి




మనసు చీకాగ్గావుంది. ఏంపని చేయడానికీ తోచడంలేదు. రోజూ పాపుండేది కనుక బాధలేకపోయేది. యివ్వాళ సెలవు. ఏం పూసుపోవటం లేదు. పోనీ యింట్లో కూర్చుందామా అంటే ఒంటరిగాణ్ణాయె. తల్లీ; తండ్రీ; పెళ్ళాం, బిడ్డలు, ఈ ఖాదరబందీలేం లేవు నాకు. ఒంటరిగాణ్ణి. పెళ్ళి కాలేదు. చేసుకుందామనే వుంది,

ఈ ఆలోచన వచ్చినందుకు నాలో నేనే సిగ్గుపడ్డాను. 21 యేళ్లన్నా నిండలేదు, అప్పుడే పెళ్లేమిటనిపించింది. అలా వీధిలోకి బయలుదేరాను. వీధిలోమాత్రం తెలిసినవాళ్లెవరున్నారు కనక ఈ వూరువచ్చి పాపుపెట్టి మాసమేనా కాలేదు, అలా బస్‌స్టాండ్‌వేపు వెళ్ళాను. అక్కడ ఏవేవో గ్రామఫోన్ రికార్డులు వినిపిస్తున్నయ్.

'ఏమిటది' వాకబుచేశాను.

'కార్నివాలీ అండీ. మంచి డాన్సుప్రదర్శన ముంది యిప్పుడు' బస్ కండక్టరు యిచ్చాడు యిన్‌ఫర్‌మేషన్.

పోనీ కాసేపన్నా డాన్సు చూడొచ్చని పోయి కూర్చున్నాను రెండురూపాయల టికెట్‌కొని. ఫ్రంట్‌సీట్ నాదే. అనుకున్న టయిమ్‌కి అరగంట లేటుగా ప్రారంభమయింది ప్రదర్శనం. ఒకడు సుబ్బిసెట్టివేషంలోనూ, మరో దుక్క (రోడ్డురోలర్‌లాంటి) ఆవిడ చింతామణి లాగానూ, వచ్చి స్టేజిమీద ఏవో బూతుకూతలు కూస్తున్నారు. కార్నివాలీ అంటే ఏమిటో అనుకున్న నాకు, యీ అలగాప్రదర్శనం చూసేసరికి అసహ్యం వేసింది. సుబ్బిసెట్టి ఆవిడపై విసరిన బెణుకులకి ప్రేక్షకులు చాలా మంది కడుపుబ్బ నవ్వేస్తున్నారు. మరికొందరు 'శభాష్........' అంటూ వారి నోటికొచ్చిన సంస్కృతపదాల్ని వల్లెవేస్తున్నారు. మరోపక్క నుంచి ఈలలు వినపడసాగినై. 'కార్నివాలీ' అంటే థర్డ్‌క్లాస్ ప్రదర్శనమేమో ననిపించింది.

ఇంక లేచిపోదామనుకుంటుండగా వీళ్లిద్దరూ నిష్క్రమించారు. వెంటనే ఒక సన్నని మెరుపుతీగలాంటి అమ్మాయి, వెనుక చింతామణీ వేసిన రోలర్ ప్రవేశించారు, వాళ్ళు కట్టుకున్నది జార్జెట్ చీరెలు. లోపల పరికిణీలు వేసుకున్నట్టు లేదు.... ఘోరం !! మెరుపుతీగవేపు చూశాను. జార్జెట్ చీర, జాకెట్ కలిసీ పుబికివస్తున్న ఆమె వక్షోజాలను దాచలేకపోతున్నై! ఈవిధంగా ఎప్పుడూ చూడని నేను నాలోనే యేదోవిధంగా ఫీలయ్యాను. నగ్నంగా కనిపిస్తున్న అమెవేపు చూశాను. యింతలో వీళ్ళిద్దరూ డాన్సు ప్రారంభించారు సినిమా పాటలుపాడుతూ. యిద్దరు పిచ్చివాళ్లు నడి రోడ్డుమీద గెంతుతున్నట్టుంది వీళ్ల డాన్సు.

'అ మద్దిముక్కకంటే, ఈ సన్నపాటిది బాగా డాన్సుచేస్తోంది. నాపక్కాయన తన అమూల్యాభిప్రాయాన్ని, వివరించాడు.

'ఊఁ!' అంటూ మళ్ళా ఆమెవేపు చూశాను. మళ్లీ....మళ్లీ 'ఈ ముఖం ఎక్కడో చూసినట్టుందే!' హఠాత్తుగా పైకనేశాను.

'అఁ! ఏకంపెనీలోనో చూసివుంటారు. రేటెంతోలేదుట లెండి. ఒక రాత్రికి యాభై రూపాయల్ట. కుదర్చమంటారా?' అడిగాడు పక్కాయన రహస్యంగా.

మాట్లాడకుండా ఊరుకున్నాను. యాభై రూపాయల్తో రాత్రిమొదలు తెల్లవారేవరకు ఒక దాసి వస్తుంది. మనం ఆడమంటే ఆడుతుంది. పాడమంటే పాడుతుంది. ఒంటిమీద గుడ్డకూడా లేకుండా. ఛీ, అనిపించింది. కార్నివాలీ అంటే మేడిపండని తెలిసింది.

మళ్ళా ఆ అమ్మాయివేపు చూశాను. ఈ మొఖం ఎక్కడో చూసినట్లుంది. ఎక్కడా.... అని?? పోనీ ఎక్కడేనా వ్యభిచార గృహంలో పరిచయమయ్యిం దనుకోవటానికి, యిప్పటికి నేను వ్యభిచారగృహప్రవేశోత్సవం జరపనే లేదాయె!! మరి ఎక్కడచూశాను చెప్మా? 'మల్లమ్మ కాదుకద!' అనుకున్నాను.

మాయింటివెనుక తోటలో ఉండే సింగయ్య కూతురు మల్లమ్మ నా మనోవీధిలో మెరిసింది అమె. నేను యస్ యస్. యల్ సి పాసయిన నాడె గాబోలు, తన తండ్రిని తీసుకుని ఎక్కడకో వెళ్లిపోయింది, యిప్పటికి అప్పటికీ దూరం నాలుగు సంవత్సరాలు. అయినా నేను మల్లమ్మను గుర్తుపట్టగలిగాను! నా జ్ఞాపకశక్తిని నేనో అభినందించుకొన్నాను.

యీ అనుమానం వచ్చాక నా అతృత హెచ్చింది. ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాను. 'మల్లమ్మనా? అయితే, ఆమె యిలా అవవలసిన అవుసర మేమొచ్చింది? యింతకీ మల్లమ్మ కాదేమో ?'

'యిదిగో మిస్టర్ ! డాన్సు అయిపోయింది : మరి, నే నడిగినవిషయం తేలుస్తే, మరోటి చూసుకుంటా. మంచిఛాన్సు వదులుకోవద్దు' అన్నాడు మొదటినుంచీ నాపక్క కూర్చున్నాయన.

అసహ్యంవేసింది. మనిషిచూస్తే టిప్‌టాప్‌గా ఉన్నాడు. వృత్తిచూస్తే చాచి లెంపకాయ కొడుదామనుకున్నాను.

కాని....మెరుపులా ఒక అలోచన వచ్చింది.

'సరే. యిస్తాను కాని ఆమె నా లాడ్జికి రావాలి' అన్నాను. లాడ్జికి తీసుకుపోయి ఈమె అంతు తేల్చుకోవాలని.

'ఓ. యస్! అదెంతపని! ముందే చెప్పేస్తున్నా. రేట్ ప్లస్‌ఛార్జెస్ అండ్ బ్రోకరేజ్ భరించాలి' అన్నాడు.

'అలాగే! వెళ్లి మాటాడు. నేను అవతల చెట్టుకింద ఉంటాను' అన్నాను.

అతను హుషార్‌గా వెళ్లిపోయాడు. మరో క్షణంలో జరుగబోయే సంఘటనగూర్చి ఆలోచిస్తూ చెట్టుక్రింద నిలబడ్డాను.

'ఏయ్! ఎవరు నువ్వు' అన్నది ఎర్రబుట్ట దగ్గరగావచ్చిచూచి 'ఓ! ఫాన్సీషాప్ ప్రొప్రయిటర్ మూర్తిజీ! ఏం? కార్నివాలీమీద దయ కల్గిందా?' నా జవాబుకోసం ఎదురుచూడకుండా నవ్వుతూ వెళ్లిపోయాడు,

గాజుల గలగల వినిపించింది. దగ్గరగా రోడ్డుపక్కనుంచి ఆమె, బ్రోకరూ నన్ను పిలుస్తున్నారు. వెళ్ళాను. రిక్షాపిల్చి యిద్దరం ఎక్కాం. బ్రోకర్ చెయ్యిజాచాడు. ఓ రెండు రూపాయల నోటు చేతిలో పడేశాను.

రిక్షాలోకూడా, ఆమె నన్ను తగులుతూ, మీదగా కూర్చుంది మొహంకి మొహంరాస్తూ. చికా కనిపించింది. 'దూరంగా కూర్చో' మెల్లగా అని, చేత్తో నెట్టాను. రామరామ! జార్జెట్‌చీరతోనే వచ్చేసినట్టుందీ! 'ఖర్మ' అనుకున్నాను.

రూమ్ వచ్చింది. ఆమెను లోపలికి తీసుకొనివెళ్ళాను రిక్షాఅద్దె చెల్లించి, ఆమె నాకంటే ముందు తలుపు గడియపెట్టింది. నేను సోఫాలో కూర్చున్నాను. రూమ్‌లో లైటార్పేసి బెడ్‌లైట్ వెలిగించి, 'రండి' అంది మంచం ఎక్కి. నేను తీసుకవచ్చిన విషయం కదపటం ఎలాగో అర్థంకాలేదు. గబుక్కున అన్నాను 'నేను నిన్ను తీసుకువచ్చింది అందుకుకాదు. నే నడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పు. నీపేరు మల్లమ్మేనా? నీ తండ్రి పేరు సింగయ్యేనా? మాట్లాడవేం? అవునా? కాదా?'

గతుక్కుమంది ఆమె మంచందిగి చీర చుట్టబెట్టుకుంటూ రెండడుగులు వెనక్కువేసింది. 'ఎవరు మీరు? ఏమిటీ పరిహాసం? నాపేరు మల్లిక! మల్లమ్మకాదు!! కాబోదు!!!' అంది. ఆగొంతులో భయచిహ్నాలు కనిపించినై నాకు.

మళ్ళా అన్నాను 'యిప్పుడు కాదు యిక ముందు కాబోదు. కాని, వెనుక, నీపేరు మల్లమ్మే! చెప్పుమల్లమ్మా! నన్ను గుర్తుపట్టలేక పోయావా? మీనాన్న మాతోటలో నే పనిచేస్తుండే వాడు. నేను రామయ్యగారి అబ్బాయిని, మూర్తిని, జ్ఞాపకంలేదా మల్లమ్మా! అన్నా ఆవేశంగా.

'ఓ! మీరా! ఈ నీచస్థితిలో చూసి నన్ను ఏడిపించడానికి తీసుకువచ్చారా? అయినా ఫర్వాలేదు. నన్ను వెళ్లనివ్వండి' అపుతున్నా, నిర్లక్ష్యంగా తోసుకొస్తూ అన్నది మల్లమ్మ.

'అగు మల్లమ్మా, చెప్పు! నీవీ వృత్తిలో చేర వలసిన అవసర మేమొచ్చింది?

'భుక్తిలోపం' విషాదంగా అన్నది మల్లమ్మ.



'నన్ను నీ ఆత్మీయుడిగా భావించి నిజం చెప్పు మల్లమ్మా! నేను ఏ దురుద్దేశంతోనూ నిన్నిక్కడికి తీసుకురాలేదు. ఎన్నాళ్లనుండి ఈవిధంగా బ్రతుకుతున్నావు? చెప్పు!' అన్నాను.

నిశ్శబ్దంగా ఏడుస్తూ అన్నది మల్లమ్మ నాన్నపోయి పదిహేనురోజులవస్తోంది. ఆయన కూలినాలిచేసి కూడపెట్టింది ఆయన దిన కార్యాలకీ, ఈ వారంరోజులు తిండికీ సరి పోయింది. రెండురోజుల క్రిందట డాన్సు ప్రదర్శన లివ్వవచ్చునీ. బాగా డబ్బొస్తుందనీ, ఒకాయన నన్నిందులో చేర్పించాడు. యిలా బ్రతుకవలసి వస్తుందని యివాళ సాయంత్రం దాకా నాకు తెలీదు. అక్కడ అందరి బల వంతంవల్ల యిందుకు ఒప్పుకొని మీతో రావలసి వచ్చింది. యిప్పటివరకూ నే నేపాపమూ ఎరగను బాబూ! నేను చేయ బోతున్న మొదటి పాపకార్యాన్ని ఆపి, నన్ను కాపాడారు మీరు. నా కృతజ్ఞత ఏవిధంగా చెప్పాలో తెలియుటలేదు. నన్ను పోనివ్వండి' అంది.

'అగు మల్లికా' ఆశ్చర్యంగా చూసింది నావంక.

'అనాఘ్రాణిత పుష్పాన్ని అయాచితంగా వదులుతాననుకున్నావా? మల్లికా! నావా ళ్లెవరూ నాకులేరు. జాతి మతభేదాలుకూడా లేవు. నీ జీవితం బాగుచేయడం సంగతి అటుంచి, మొదట నాజీవితం నేను బాగు చేసుకోవాలి. నన్ను పెళ్లిచేసుకుంటావా మల్లికా!' అన్నాను.

'నామాటలు నమ్మి నన్ను భార్యగా చేసు కొనేందుకు అంగీకరిస్తున్నారా' ఆశ్చర్యం గానూ, ఆనందంగానూ అన్నది మల్లిక.

'మాటలు అబద్ధమో, నిజమో ముఖం చెబుతుంది మల్లికా! నిన్ను నేను నమ్ము తున్నాను. నన్ను నువ్వు నమ్ము' అన్నాడు.

'మీరు చాలా గొప్పవారు మూర్తిబాబూ! గొప్పగొప్ప నాయకులు ఉపన్యాసాలలోగాని చెయ్యలేని పనిని, మీరు చేతలలో చూపి స్తున్నారు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియటంలేదు' అంది.

'తీర్చుకుందువుగాని, నా భార్యవైనాక' అంటూ లాక్కున్నాను.

ఆ రాత్రి మా దాంపత్య జీవితాన్నిగురించి ఎన్నో కలలు కన్నాం.

రాత్రి మధుర అనుభవాలను తల్చు కుంటూ, నేను లేచేసరికి గడియారం ఎని మిది కొడుతోంది. పక్కనిగాని, గదిలోగాని మల్లిక లేదు. ఎదురుగా టేబిల్‌మీద బ్రష్, టూత్‌పేస్టు, చెంబుతో నీళ్లు, ఫ్లాస్కు, పక్కనే ఒక పొట్లం ఉన్నయ్. ఆనందంగా వాటినందు కుని, ఈ దినంనుంచి నా జీవితమే మారిం దనుకుంటూ ముఖం కడుక్కొని, చల్లగా ఉన్న యిడ్లీలు తిని, వేడి కాఫీతాగుతూ 'మల్లికా' అని పిల్చాను. జవాబులేదు. ఒక గంట....రెండు గంటలు.... వెయిట్‌చేస్తూనే ఉన్నాను. కానీ మల్లిక రాలేదు. ఒకవేళ కార్నివాల్ ఒదిలించుకోవటానికి వెళ్లిందేమో! వాళ్లక్కడ వెళ్లటానికి వీల్లేదన్నారేమో నని పించి గాభరాగా అక్కడికి పరుగెత్తాను. అక్కడ ఎవరూ లేరు, కాపలా వాణ్ణి పలకరిస్తే మాటలురావని సైగచేశాడు. కాలుగాలిన పిల్లిలా ఊరంతా తిరిగాను. నిరాశే ఎదు రైంది. త్రోవలో రైల్వేక్లార్కు సోమేశం కన్పించి 'పార్శిలు విడిపించేందుకు వస్తానని రాలేదే' మని ప్రశ్నించాడు.

అది జ్ఞాపకంవచ్చి యింటికి వెళ్ళాను. పర ధ్యానంగా తలుపులు తీసి లోపలికి వెళ్లి గ్లాసుడు మంచినీళ్లుతాగి ఓపావుగంట కూర్చు న్నాను. అలసట కొంచెం తగ్గింది. తాళం చెవి తీసి ట్రంక్‌దగ్గరకు వెళ్లేసరికి, దాని తాళం విరిగిపోయి ఉంది. గాభరాగా మూతతెరిచి లోపల చూసేసరికి లోపల ఉండవలసిన రెండువేలూ లేవు. గుండె ఝల్లుమంది. నా మనస్సులో మల్లిక....ఛీఛీ....మల్లమ్మ మెరి సింది. ఎంత నీచానికి వడిగట్టింది

సాయంకాలం కార్నివాలీకివెళ్లి ఎంక్వయరీ చేశాను బ్రోకర్ నడిగి. ' ఆ అమ్మాయాసార్? మరెక్కడో ప్రోగ్రాముందని, యీ కాంట్రాక్టు కేన్సిల్‌చేసుకొని వెళ్లిపోయింది సార్! యీ సారి సుందరి అని వచ్చిందిసార్....సుందరి నిజంగా సుందరే సార్....సార్....' యింకే మేమో అ సుందరిని వర్ణిస్తున్నాడు. ఆ వర్ణన వినలేక వెనక్కు వచ్చేశాను మల్లమ్మను తల్చుకుంటూ.

ఎంతమోసం! బాగుచేస్తానన్న జీవితాన్ని బాగుచేసుకోలేకపోవడం కాకుండా నన్ను మోసంచేసి, తన నీచబుద్ధిని వెల్లడిచేసుకొన్న మల్లమ్మ అంటే అసహ్యంవేసిందినాకు! అసలు ఆమె నిజంగా మల్లమ్మేనా? లేక....అ పేరు చెప్పి, వివరాలు చెప్పగానే తెలిసినట్టు నటిం చిందా? ఎంత నటన! ఎంత నటన!! నీచ జీవితానికి అలవాటుపడ్డ స్త్రీ పవిత్ర జీవితాన్ని గడపదేమో? అందుకేనేమో యీ నాయ కులు వేశ్యా సంస్కరణాన్ని చేతల్లోగాక మాటల్లో చెప్తున్నది.

కుక్కతోక సామెత జ్ఞాపకం వచ్చించి. కుక్కతోకకి బద్దకట్టినన్నాళ్లూ తిన్నగా ఉంటుంది! అది తీసేయగానే....వంకర వంకరే! మల్లమ్మ.......కుక్కతోక.......నవ్వు కున్నాను చిన్నగా.

★